సాక్షి
మహబూబాబాద్
మంగళవారం : 21 : మే : 2024



అంతరాయానికి బ్రేక్..
నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అధికారులు, సిబ్బంది సమష్టిగా విధులు నిర్వర్తించడంతో టీజీ ఎన్పీడీసీఎల్‌లో బ్రేక్ డౌన్లు, ట్రిప్పింగ్‌లు కనిష్ట స్థాయికి తగ్గాయి. - 8లో▸



డీఈఓ వేధింపులకు పాల్పడుతున్నాడు..
డీఈఓ తనను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఔట్ సోర్సింగ్ ఆఫీస్ సబార్డినేట్ సోమవారం నిరసన తెలిపింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
39⁰ /27⁰

వాతావరణం
జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పీహెచ్‌సీ రికార్డుల పరిశీలన



కేసముద్రం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ మేరకు పలు రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండి ఉత్తమ వైద్యం అందించాలన్నారు. ఆస్పత్రిలో నార్మల్ డెలివరీ జరిగేలా చూడాలన్నారు. అనంతరం తాళ్లపూసపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించగా, ఆస్పత్రికి ప్రహరీ గోడ నిర్మించాలని డీఎంహెచ్‌ఓను, ఆ గ్రామ సీపీఎం నాయకుడు వెంకన్న కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణార్జున, ఎస్‌యూఓ శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ నంబికిషోర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్ రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్‌లో ఒకటవ, ఐదవ తరగతుల్లో 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశం కొరకు అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఇన్‌చార్జ్ అధికారి ఆర్. బాలరాజు సోమవారం తెలిపారు. 1వ తరగతి విద్యార్థుల వయస్సు 5 నుంచి 6 సంవత్సరాల లోపు, 5వ తరగతి విద్యార్థులకు 01-09-2014 నుంచి 31-08-2015 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఐదవ తరగతి విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామాల వారికి రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలు వార్షిక ఆదాయం ఉండాలన్నారు. లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థుల ఎంపిక చేయబడుతుందన్నారు. దరఖాస్తులు జూన్ 7వ తేదీలోపు జిల్లా షెడ్యూల్ కులాల కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఆయిల్‌పామ్ సాగు పెంచాలి



మహబూబాబాద్ రూరల్: జిల్లాలో రైతులు ఆయిల్ పామ్ సాగు పెంచే విధంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారి కొర్స అభిమన్యుడు, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. ఆయిల్ పామ్ సాగుపై జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ అధికారులు, ఉద్యాన అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులందరూ ఆయిల్ పామ్ సాగు చేయాలని, పంట మార్పిడి చేసి ఆయిల్ పామ్ పంట వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మీనారాయణ, శోభన్ బాబు, రాజనరేందర్ పాల్గొన్నారు.

టీఎస్‌ఈసెట్‌లో 8వ ర్యాంకు



కురవి: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన విద్యార్థి మొగిలిచర్ల కార్తీక్‌కు టీఎస్ ఈసెట్‌లో 8వ ర్యాంకు సాధించాడు. సోమవారం విడుదల చేసిన టీఎస్ ఈసెట్(ట్రిపుల్‌ఈ)లో కార్తీక్‌కు రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు సాధించాడు. ట్రిపుల్‌ఈ విభాగంలో 200 మార్కులకుగాను 112 మార్కులు సాధించాడు. రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడంపై గ్రామస్తులు అభినందించారు.

24న మల్యాల కేవీకేలో విత్తనమేళా

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 24వ తేదీ శుక్రవారం విత్తనమేళా నిర్వహిస్తున్నామని కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి సో మవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విత్తన మేళాలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రూపొందించిన వివిధ పంటల రకాలు, వాటి సొలభ్యత గురించి సమాచారం అందిస్తామన్నారు.అలాగే నాణ్యమైన రకాలు,పంటకాలం దిగుబడి, ఇతర విషయాల సమాచారాన్ని శాస్త్రవేత్తలు రైతులకు వివరిస్తారన్నారు. ప్రస్తుతం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో వరిలో వరంగల్ సిద్ది సాంబ (డబ్ల్యూజీఎల్ 44)ఫౌండేషన్ విత్తనం అందుబాటులో ఉందన్నారు. సన్న రకం 145రోజుల పంటకా లం కలిగి ఉండి, మంచి దిగుబడి వస్తుందన్నారు. కునారం (కేఎస్‌ఎం) సన్నాలు (దొడ్డు గింజరకం) స్వల్పకాలిక రకం , 120 రోజుల పంట కాలం కలిగి ఉంటుందన్నారు. డబ్ల్యూజీఎల్ 962 రకం 130 రోజుల నుంచి 135 రోజుల పంట కాలం మధ్యస్థ గింజ రకం అందుబాటులో ఉన్నాయన్నారు.

నామినేటెడ్‌పై ఆశలు

గాంధీభవన్ చుట్టూ ఆశావహుల ప్రదక్షిణ
- పార్టీ కోసం పని చేశాం.. పదవులు ఇవ్వండని విన్నపం
- అనుచరులకోసం ఎమ్మెల్యేల ప్రయత్నాలు
- ఎవరికి వరిస్తుందోనని జిల్లాలో చర్చ



సాక్షి, మహబూబాబాద్: పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పదవుల పందేరం మొదలు అవుతుందని సంకేతాలు రావడంతో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న ఆశావహులు గాడ్ ఫాదర్స్‌ను కలిసేందుకు గాంధీ భవన్ బాట పడుతున్నారు. ఇప్పటికే జిల్లాకు మూడు నామినేటెడ్ పదవుల రాగా.. వాటిపై ఆ నాయకులు అసంతృప్తితో ఉన్నారని, వీరికి తోడు ఎమ్మెల్యే టికెట్ ఆశించి వెనక్కి తగ్గిన వారితోపాటు ఇటీవల పార్టీలో చేరిన నాయకులు కూడా పదవులకోసం ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. ఎన్ని నామినేటెడ్ పదవులు ఇస్తారు, ఇందులో జిల్లాకు ఎంత మందికి ఇస్తారు, కుల సమీకరణలు మొదలైన అంశాలను ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉన్నందున ఎవరికి పదవులు వరిస్తాయోనని జిల్లాలో చర్చగా మారింది.

పదవి కోసం ప్రయత్నాలు..
రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ, నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తారని వార్తలు రాగానే జిల్లాలోని పలువురు నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే జిల్లాకు చెందిన వేం నరేందర్‌రెడ్డికి ముఖ్యమంత్రి సలహాదారుడిగా, బెల్లయ్య నాయక్‌కు గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా, నెహ్రూనాయక్‌కు రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులుగా నామినేట్ చేశారు. అయితే వరుస ఎన్నికల కోడ్‌లు అమలులోకి రావడంతో ఇప్పటి వరకు ఆర్డర్లు ఇవ్వలేదు, ప్రమాణ స్వీకారం చేయలేదు. అయితే పార్టీ ఏ పదవి ఇస్తే అదే శిరోధార్యం అని వారు చెబుతున్నా.. ఇందులో ఒక్క వేం నరేందర్‌రెడ్డి మినహా మిగిలిన ఇద్దరు ఆ పదవిపై సంతృప్తిగా లేరని వారి అనుచరులు చెబుతున్నారు. అలాగే పాలకుర్తి ఎమ్మెల్యేగా పనిచేయాలని అమెరికా నుంచి వచ్చిన అనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అనూహ్య పరిణామాలు, భారత పౌరసత్వం లేకపోవడంతో వెనక్కి తగ్గారు. అయితే పట్టు వీడకుండా కోడలు యశస్విని రెడ్డిని పోటీలో నిలిపి గెలిపించారు. సభలు, సమావేశాల్లో ప్రోటోకాల్ ఇబ్బంది అవుతుంది. నామినేటెడ్ పదవి ఇస్తే ఏ చికాకు ఉండదని పార్టీ అధిష్టానానికి చెప్పినట్లు సమాచారం. అదేవిధంగా పాలకుర్తి నియోజకవర్గం నుంచి కాకిరాల హరిప్రసాద్ కూడా నామినేటెడ్ పదవి ఇవ్వాలని వారు కోరినట్లు చర్చ. వీరితోపాటు ఇటీవల పార్టీలో చేరిన నూకల నరేష్ రెడ్డి కూడా తనకు నామినేటెడ్ పదవి ఇచ్చే విషయం ఆలోచించాలని పార్టీ పెద్దలను కోరినట్లు తెలిసింది. బలరాం నాయక్ కూడా ఇద్దరు ముగ్గురు అనుచరుల పేర్లు ఇచ్చి వీరికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని, ఇతర పార్టీ పెద్దలను కోరినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఎస్టీ (లంబాడ) కోట కింద రాష్ట్రంలో ఒక్క మంత్రి పదవి కూడా లేదని, దీంతో ఆయా వర్గాల ప్రజలు పార్టీ పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారనే వాదన తీసుకొచ్చారు. ఈ సారి మంత్రి వర్గ విస్తరణలో మంత్రి పదవి ఇవ్వాలని ఎస్టీ లంబాడ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కోవలోనే డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ కూడా మంత్రి పదవి కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇలా ఎవరికి వారుగా నామినేటెడ్ పదవులపై ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు మరెన్ని పరిణామాలు చోటు చేసుకుంటాయో.. అదృష్టం ఎవరిని వరిస్తుందో.. పదవులు ఎవరికి దక్కుతాయోననే చర్చ జరుగుతుంది.



పార్టీనే నమ్ముకొని..
జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్‌తోపాటు ములుగు, ఇల్లెందు నియోజకవర్గాలు ఎస్టీ రిజర్వుడు అయ్యాయి. పాలకుర్తి జనరల్ స్థానమైనా.. అక్కడే వైవిధ్యమైన పోటీ నెలకొంది. ఈ పరిస్థితిలో పార్టీ కోసం పనిచేసిన నాయకులు ఇప్పుడు నామినేటెడ్ పదవులు వస్తాయనే ఆశతో ఉన్నారు. మొదటి నుంచి మహబూబాబాద్ జిల్లాపై పట్టున్న నాయకుడిగా పేరున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్‌రెడ్డి రిజర్వేషన్ కలిసి రాక ఎమ్మెల్యేగా పోటీచేయలేకపోయారు. అయితే తండ్రి జనార్దన్‌రెడ్డి రాజకీయ వారసత్వాన్ని పునికి పుచ్చుకున్న ఆయన మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్ గెలుపులో కీలక భూమిక పోషించారు. దీంతో ఆయనకు కార్పొరేషన్ పదవులు కాకుండా ఎమ్మెల్సీ పదవి వస్తుందని ఆయన వర్గీయులు చెబుతున్నారు. అదేవిధంగా మహబూబాబాద్ మండలం రెడ్యాల గ్రామానికి చెందిన వెన్నం శ్రీకాంత్‌రెడ్డి టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. పార్టీ అధినేత ఆదేశాల మేరకు ఎన్నికల సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా వెళ్లారు. అన్నీతానై యశస్వినిరెడ్డి గెలుపుకోసం పనిచేశారు. రాజకీయ ఉద్దండుగా పేరున్న ఎర్రబెల్లి దయాకర్ రావును ఓడించడంలో కీలక భూమిక పోషించిన శ్రీకాంత్‌రెడ్డికి మొదటి విడతనే నామినేటెడ్ పదవి వస్తుందని భావించినా.. చివరి నిమిషంలో పదవి వరించలేదు. దీంతో ఈసారి నామినేటెడ్ పదవి వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్‌లు ఎం డేవిడ్, లెనిన్ వత్సల్ టొప్పో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి లెక్కింపు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌కు పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి ఓట్ల లెక్కింపు సిబ్బంది నియమించాలన్నారు. సిబ్బంది పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు వంటి మెటీరియల్ సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాల్ లోనికి ప్రవేశమార్గాలు, సూచికల బోర్డ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. మీడియా సెంటర్ ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి
ఈనెల 27న జరుగనున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్‌కు జిల్లాలోని 34,933 ఓటర్లకు గాను 36 పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలను కల్పించాలన్నారు. సెక్టార్ అధికారులు ప్రతీ పోలింగ్ స్టేషన్ తనిఖీ చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే త్వరగా పరిష్కరించాలన్నారు. జిల్లాలోని 58 బ్యాలెట్ బాక్స్‌లను పోలింగ్‌కు సిద్ధం చేయాలన్నారు. తొర్రూర్ జెడ్పీహెచ్‌ఎస్, మానుకోట పాతిమా హైస్కూల్‌లో ఏర్పాటు చేసే స్ట్రాంగ్‌రూం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు అలివేలు, నర్సింహరావు, డిప్యూటీ సీఈఓ నర్మద, అధికారులు పాల్గొన్నారు.

దేవాదాయ భూములను రక్షించుకోవాలి



వేలం నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు

మరిపెడ రూరల్: దేవాదాయ భూములను రక్షించుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులదేనని ఎండోమెంట్ శాఖ పరిశీలకురాలు నందనం కవిత అన్నారు. సోమవారం మరిపెడ మండలం అగస్థేశ్వర ఆలయ భూముల కౌలు వేలంపాటకు ఆమె హాజరయ్యారు. ముందుగా కొండపై గల స్వయంభుగా వెలిసిన అగస్థేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయ శాఖ ఆధ్వర్యంలో భూముల కౌలు వేలంపాట నిర్వహించారు. అబ్బాయిపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 285లో 14.25 ఎకరాలు, 290 సర్వేలో 7 ఎకరాలు, 291లో 7.5 ఎకరాలు, 292, 294, 295,296 సర్వే నంబర్లలో 6.2 ఎకరాల మొత్తంగా 27 ఎకరాల వ్యవసాయ భూమి దేవుడి మాణ్యం కింద కలిగి ఉందన్నారు. ఆయా ఆలయ భూమిలో తవ్వకాలు, ఆక్రమణలు జరిగితే దేవాదాయ చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ మేరకు 27 ఎకరాల దేవుని భూములను కౌలు వేలం వేయగా రూ.1.18 లక్షలకు గ్రామానికి చెందిన పలువురు రైతులు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ మార్క్ శేఖర్, అర్చకులు ప్రసాద్‌శర్మ, గ్రామ పెద్దలు వంటికొమ్ము సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, తల్లాడ వెంకటరామారావు, రావుల వెంకట్‌రెడ్డి, కురియాల రాములు, జినక వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకనవుతా..

- బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

మహబూబాబాద్ అర్బన్: పట్టభద్రుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకనవుతానని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఎస్వీ డిగ్రీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల సమావేశానికి గుజ్జుల హాజరై మాట్లాడుతూ.. హామీలిచ్చి ప్రజలను వెన్నుపోటు పొడవడంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ దొందూ దొందే అన్నారు. ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి సీరియల్ నంబర్ 1లో ఓటు వేసి గెలిపించాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డిలు మాట్లాడారు. ప్రేమేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు

- డీఈఓ రామారావు

మహబూబాబాద్ అర్బన్: ప్రతిభకు, చదువుకు పేదరికం అడ్డుకాదని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూని యర్ కళాశాల ప్రాంగణంలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి ప్రతిభా పురస్కారాలు సోమవారం నిర్వహించగా డీఈఓ హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చది వే విద్యార్థులు పేదరికం నుంచి ఉన్న వారు కష్టపడి చదివి పదిలో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. పదో తరగతి ఫలితాల్లో 22వ స్థానం నుంచి 12వ స్థానంలో నిలిచి ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య, గౌరవ అధ్యక్షుడు భువనగిరి రవీందర్ గుప్త, ప్రధాన కార్యదర్శి ఆకుల సాంబయ్య, కోశాధికారి తండ సదానందం పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: బహుమతులు అందుకున్న విద్యార్థులతో డీఈఓ

పునఃప్రారంభానికి ముందే యూనిఫాం అందించాలి
ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభంనాటికి విద్యార్థులకు స్కూల్ యూనిఫాం అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మండల రిసోర్స్ సెంటర్‌ను సోమవారం డీఈఓ సందర్శించి మాట్లాడారు. ఎంఈఓలు, ఎంఎస్‌ఓలు, ఏపీఎంలు, మెప్మా మెంబర్స్ ఏకరూప దుస్తులను విద్యార్థులకు అందజేసే వరకు ప్రతీఒక్కరి భాగస్వామ్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ, రాజేశ్వర్, అజాద్ చంద్రశేఖర్, మహిళ సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతుల పరిశీలన
కేసముద్రం: కేసముద్రంస్టేషన్ జెడ్పీహైస్కూల్‌లో టెన్త్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు(2023–24) నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను డీఈఓ రామారావు సోమవారం ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. తరగతుల నిర్వహణ ఎలా ఉందనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సందేహాలను తీర్చాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కొత్త జగన్మోహన్‌రెడ్డి, హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి చట్టం పరిరక్షణకు ఉద్యమించాలి

మరిపెడ రూరల్: కాంమ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య పోరాట స్ఫూర్తితో ఉపాధి కూలీ చట్టం పరిరక్షణకు ఉద్యమించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శ అలువాల వీరయ్య అన్నారు. మరిపెడ మండలం తండధర్మారం, బాల్నిధర్మారం ఉపాధి పని ప్రదేశాలలో కూలీలతో కలిసి పు చ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా వీర య్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 10ఏళ్ల కాలంలో ఉపాధి చట్టానికి బడ్జెట్లో నిధులు తగ్గించి అనేక సవరణలు చేసి ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఉపాధి చట్టాన్ని పరిరక్షించుకునేందుకు మే31న జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాణాల రాజన్న, కుమ్మరికుంట్ల వెంకన్న, శోభన్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధి కూలీలు

గింజల దోపిడీ ఆగేదెన్నడు?

రైతులను ఇబ్బంది పెడుతున్న కొందరు కూలీలు
- వ్యవసాయ మార్కెట్‌కు రావాలంటే భయపడుతున్న రైతులు
- నిరుపయోగంగా ప్రచార బోర్డులు



బస్తాలు నింపే సమయంలో రైతుతో వాగ్వాదం చేస్తున్న కూలీలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసే కూలీల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. కూలీలు చెప్పిందే వేదం అన్నట్లుగా, వారు అడిగిన కాడికి గింజలు ఇస్తేనే రైతులను ఏమి అనకుండా వదిలేస్తున్నారు..లేదంటే తమకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ తంతు ప్రతీరోజు జరుగుతున్నప్పటికీ ఏఎంసీ పాలకవర్గం, మార్కెట్ అధికారులు పట్టించుకోవటంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. కూలీలకు, హమాలీలకు దానధర్మాల పేరిట ఎలాంటి గింజలు పెట్టకూడదని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో రాసిన బోర్డులు నిరుపయోగంగా మారాయి. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు కురవి, బయ్యారం, మరిపెడ, సీరోలు, కేసముద్రం, గూడూరు, నెల్లికుదురు, ఇతర మండలాల నుంచి రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించేందుకు తీసుకువస్తుంటారు. ఈ క్రమంలో వారు పత్తి, ధాన్యం, మొక్కజొన్న, పెసర్లు, మినుములు, కందులు, బొబ్బెర్లు, వేరుశనగ, పచ్చజొన్న పంట ఉత్పత్తులను విక్రయించేందుకు తీసుకురాగా బస్తాలు నింపటం, కాంటా పెట్టే క్రమంలో మోసాలు జరుగుతున్నాయి. కూలీలు బస్తాలు నింపే సమయంలో రైతుల వద్ద నుంచి దానధర్మాల పేరిట గింజలను అడుగుతున్నారు. రైతులు ఇచ్చిన వరకు సరిపెట్టుకోకుండా అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పైగా ఒకానొక సందర్భంలో రైతుల కళ్లుగప్పి గింజలను చోరీ చేస్తూ బస్తాల్లో నింపుకుంటున్నారు. ఇదేమి దోపిడని రైతులు అడిగితే వారిని దబాయిస్తున్నారు. దీంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో కూలీల గింజల దోపిడీ ఆగడాలకు చెక్ పెట్టకుంటే రైతులు మార్కెట్‌కు రావటం బంద్ చేస్తారని పేర్కొన్నారు.

ఐదు కిలోల బొబ్బెర్లు గుంజుకున్నారు..



రెండు క్వింటాళ్ల బొబ్బెర్లు విక్రయించేందుకు తీసుకువచ్చాను. కొనుగోళ్లు అయ్యాక బస్తాలు నింపే సమయంలో కూలీలు అడిగితే రెండు కిలోల బొబ్బెర్లు ఇచ్చినప్పటికీ నన్ను అదరగొట్టి మళ్లీ ఐదు కిలోల బొబ్బెర్లు గుంజుకున్నారు. ఇదేమిటని అడిగితే పట్టించుకోకుండా మార్కెట్లో కూలీలు ఇష్టం వచ్చినట్లు దోచుకుంటున్నారు. ఇలాగైతే రైతులు మార్కెట్‌కు రావాలంటేనే భయపడుతున్నారు. – గోపి సంజీవ, రైతు, ఎడ్జర్ల, మరిపెడ

చాటుగా తీసుకున్నారు..



అయ్యగారిపల్లి నుంచి క్వింటా పెసర్లు తీసుకు రాగా కొనుగోళ్లు అయ్యాక బస్తాలు నింపే సమయంలో కూలీలు అడిగితే రెండు కిలోల పెసర్లు ఇచ్చాను. అవి చాలవన్నట్లుగా దొంగతనంగా బస్తాలో నుంచి చాటుగా మరో మూడు కిలోల పెసర్లు తీసుకువెళ్తుంటే గుర్తించి పట్టుకున్న. కూలీల బెదిరింపులు, ఆగడాలతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.
– బొల్లు వీరయ్య, రైతు, అయ్యగారిపల్లి, కురవి

ఉపాధ్యాయ అర్హత పరీక్ష షురూ

విద్యారణ్యపురి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. హనుమకొండలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ, ఎర్రగట్టుగుట్ట వద్ద గల ఐయాన్ డిజిటల్ జోన్, నోబెల్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్, మోక్షిత కంప్యూటర్స్ పరీక్ష కేంద్రాల్లో టెట్ పేపర్–2 పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9నుంచి 11:30 గంటల వరకు నిర్వహించిన ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలో 245మంది అభ్యర్థులకు గాను 214 మంది హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 29మంది గైర్హాజరయ్యారు. చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ పరీక్ష కేంద్రం, మోక్షిత కంప్యూటర్స్ పరీక్ష కేంద్రంలో పరీక్ష నిర్వహించారు. నోబెల్ పరీక్ష కేంద్రంలో ఉదయం 190మందికి 172 మంది హాజరయ్యారు. 18మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 190మందికి గాను 163 మంది హాజరు కాగా 27మంది గైర్హాజరయ్యారని సంబంధిత అధికారులు తెలిపారు. కాగా హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై పరీక్ష కేంద్రాలను సందర్శించి పరిశీలించారని సమాచారం. ఈనెల 21, 22, 24, 28, 29 తేదీల్లో పేపర్–2 పరీక్షలు కొనసాగుతాయి. ఈనెల 30, 31, జూన్ 1, 2 తేదీల్లో పేపర్–1 పరీక్షలు నిర్వహిస్తారు.

నేరడ చెరువు లూటీ



చెరువులో చేపలు పడుతున్న ప్రజలు

కురవి మండలంలోని నేరడ పెద్ద చెరువును మత్స్యకార్మికులు చేపలు పట్టడం వదిలేయడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సోమవారం చెరువులోని చేపలను పట్టుకున్నారు. జనాలు ఒక్కసారిగా చెరువులోకి దిగి చేపలు పట్టుకోవడంతో కోలాహలంగా మారింది. – కురవి

క్లుప్తంగా

డీఈఓ వేధింపులకు పాల్పడుతున్నాడు..

● మహిళ ఉద్యోగి నిరసన



మహబూబాబాద్ అర్బన్: డీఈఓ తనను ఉద్దేశపూర్వకంగా మానసిక ఇబ్బందులు పెడుతూ వేధింపులకు గురి చేస్తున్నాడని ఔట్‌సోర్సింగ్ ఆఫీస్ సబార్డినేట్ (అటెండర్) పార్వతి ఆరోపిస్తూ సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపింది. తనకు రక్షణ కల్పించి, న్యాయం చేయాలని బైఠాయించింది. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ 2017 నుంచి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్నానని, ఈ డీఈఓ వచ్చినప్పటినుంచి తనకు కేటాయించిన పనులను మాత్రమే చేస్తానంటే సెలవులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని వాపోయింది. డీఈఓ చెప్పిన పనులన్నిటినీ చేస్తున్నా కక్షపూరితంగా మానసికంగా వేధింపులు చేస్తున్నారని, కులం పేరుతో తనను ఇష్టం వచ్చినట్లు మాటలు అంటున్నారని ఆరోపించింది. డీఈఓ వేధింపులు గురిచేస్తున్నాడని 2023 నవంబర్‌లో జిల్లా కలెక్టర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశానని, మానుకోట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టినట్లు తెలిపింది. అప్పటి డీఎస్పీ విచారణకు వచ్చి తాను పెట్టిన కేసు ఉపసంహరించే విధంగా సర్ది చెప్పి యథావిధిగా విధులకు హాజరయ్యేలా చూశారని తెలిపింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం రెన్యువల్ చేయకుండా తనను ఉద్యోగంలోకి రావొద్దని, వచ్చిన తనను రిజిష్టర్‌లో సంతకం పెట్టనివడంలేదని తెలిపింది. రాత్రి 9 గంటల వరకు పనిచేయించారని, ఒక రోజు పది గంటల వరకు కార్యాలయంలోనే ఉన్నానని పేర్కొంది. ఆ రాత్రి ఇంటికి వెళ్లాలంటే భయమేసి 100కు ఫోన్ చేసి పోలీస్ వాహనంలో ఇంటికి వెళ్లినట్లు తెలిపింది. నా కుటుంబానికి న్యాయం చేయాలని, మళ్లీ ఉద్యోగంలోకి తీసుకోవాలని ఆమె కోరింది. ఈ విషయంపై డీఈఓ రామారావును వివరణ కోరగా పార్వతి అనే ఆఫీస్ సబార్డినేట్ సరిగ్గా విధులు నిర్వహించడం లేదని, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులకు ఆమె స్థానంలో మరో వ్యక్తిని నియమించాలని తెలిపామని చెప్పారు. పార్వతిని ఉద్యోగం నుంచి తొలగించలేదన్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్..

● ఆస్తితగదాలే కారణం

హసన్‌పర్తి: మామను హత్య చేసిన ఘటనలో కోడలు, ఇద్దరు మనవళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ సురేష్ సోమవారం తెలిపారు. హసన్‌పర్తికి చెందిన జల్లి సారయ్య(70)కు ఇద్దరు కూ తుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు రమేష్, అశోక్ అప్పటికే మృతి చెందగా, ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు అయ్యాయి. పెద్ద కుమారుడు రమేష్‌కు భార్య రమాదేవి, ముగ్గు రు కుమారులు రాకేశ్, సాయికృష్ణ, శశికుమార్ ఉన్నారు.

ఆస్తితగాదాలే అంతమొందించాయి..

సారయ్య తన ఆస్తిలో అప్పటికే కొంత అమ్ముకున్నాడు. ఉన్న ఇంటిని కుమారుడితో పాటు ఇద్దరు కూతుళ్లకు సమాన వాటా ఇవ్వడానికి నిర్ణయించాడు. ఇందుకు కోడలు రమాదేవి నిరాకరిస్తూ వచ్చింది. దీంతో వీరి మధ్య విభేదాలు పొడచూపాయి. ఈక్రమంలో సారయ్యను హత్య చేస్తే ఆస్తి తమకు చెందుతుందని కోడలు రమాదేవి, మనవళ్లు సాయి కృష్ణ, శశికుమార్ నిర్ణయానికి వచ్చారు. రోజూ నల్లా వచ్చే సమయంలో వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఇదే అవకాశంగా భావించిన కోడలు, మనవళ్లు.. సారయ్యపై దాడి చేశారు. ఈఘటనలో సారయ్య నుదిటిపై బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

అంతరాయానికి బ్రేక్..

ఎన్పీడీసీఎల్‌లో కనిష్ట స్థాయికి బ్రేక్‌డౌన్లు, ట్రిప్పింగ్‌లు

● లోడ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు

● ఫీడర్లపై తగ్గించిన ఓవర్ లోడ్.. తగ్గిన ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు



33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్



విద్యుత్ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ : విద్యుత్ సరఫరా అంతరాయానికి బ్రేక్ పడింది. అధికారులు, సిబ్బంది సమష్టిగా రేయింబవళ్లు విధులు నిర్వర్తిస్తుండడంతో టీజీ ఎన్పీడీసీఎల్‌లో బ్రేక్ డౌన్లు, ట్రిప్పింగ్‌లు కనిష్ట స్థాయికి తగ్గాయి. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఎన్పీడీసీఎల్ యాజమాన్యం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంది. ప్రధానంగా విద్యుత్ కోతలపై ప్రతిపక్షాల దాడి తీవ్రం కావడంతో ప్రభుత్వం కూడా విద్యుత్ అంతరాయాలపై ప్రత్యేక దృష్టి సారించింది. అకారణంగా అంతరాయాలు ఏర్పడితే చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ క్రమంలో విద్యుత్ పంపిణీ సంస్థలు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరాపై దృష్టి సారించాయి. ప్రధానంగా బ్రేక్‌డౌన్లు, ట్రిప్పింగ్‌లకు కారణాలు విశ్లేషించి ముందు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వాటిని కనిష్ట స్థాయికి తగ్గించారు.

ఉద్యోగులకు పునశ్చరణ తరగతులు..

సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులకు పునశ్చరణ తరగతులు నిర్వహించి వృత్తిపర సామర్థ్యాలు పెంచారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పడుతున్న లోడ్‌కు అనుగుణంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచారు. అదనపు ఫీడర్లు ఏర్పాటు చేసి లోడ్ తగ్గించారు. విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గించేందుకు వీటి సామర్థ్యం పెంచడంతో పాటు అవసరమున్న చోట అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.

కొత్తగా నాలుగు 33/11 కేవీ సబ్ స్టేషన్లు..

ఎన్పీడీసీఎల్ పరిధిలో కొత్తగా నాలుగు 33/11 కేవీ సబ్ స్టేషన్లు నిర్మించారు. వీటి నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఇంకా 28 సబ్ సబ్ స్టేషన్లు నిర్మాణ దశలో ఉన్నాయి. నూతనంగా 15 పవర్ ట్రాన్స్ ఫార్మర్లు బిగించారు.

అదనంగా 2809 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. గతేడాది జనవరి, ఫిబ్రవరి మార్చి, ఏప్రిల్‌లో 33 కేవీ బ్రేక్‌డౌన్స్ 393 ఉండగా ప్రస్తుత ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో 133 మాత్రమే ఏర్పడ్డాయి. 260 బ్రేక్ డౌన్లు తగ్గాయి. అదే విధంగా 33 కేవీ ట్రిప్పింగ్స్ గతేడాది ఇదే కాలానికి 7998 ఉండగా ఈఏడాది 6240కి తగ్గాయి, 66.2 శాతం బ్రేక్ డౌన్స్, 210.9 శాతం ట్రిప్పింగ్‌లు తగ్గాయి. 11 కేవీ బ్రేక్ డౌన్స్ గతేడాది 2722 ఉండగా ఈ ఏడాది 1868కి తగ్గాయి. 600 కేవీఏ కెపాసిటర్ బ్యాంక్‌లు 31, 2ఎంవీఆర్ కెపాసిటర్ బ్యాంక్‌లు 109 ఏర్పాటు చేసి లోవోల్టేజీ సమస్య రాకుండా చూశారు.

ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో లైన్ల నిర్వహణ..

క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు ఇంజనీర్లు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులు లైన్ల నిర్వహణ చేపడుతూ జంపర్లను సరి చేయడం, ఒరిగిన స్తంభాలను సరిచేయడంతో పాటు అవసరమైన చోట మిడిల్ పోల్‌లు వేశారు. తద్వారా డిస్ట్రిబ్యూషన్ వైఫల్యాలు 24.59 శాతానికి తగ్గాయి. ఇక్కడ 31 శాతం బ్రేక్ డౌన్స్ తగ్గాయి. బ్రేక్ డౌన్లు, ట్రిప్పింగ్‌లు తగ్గడంతో పాటు, ఫీడర్లు పెంచడం, లైన్ల నిర్వహణ, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ నిరంతరంగా కొనసాగుతుండడంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే సంఖ్య తగ్గింది. 2022 డిసెంబర్, 2023 జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో 11,799 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా, 2023 డిసెంబర్, 2024 జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో 8,986 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలాయి. 24 శాతం ట్రాన్స్‌ఫార్మర్లు కాలడం తగ్గాయి. ఉమ్మడి జిల్లాల వారీగా చీఫ్ జనరల్ మేనేజర్ల నోడల్ అధికారులుగా నియమించారు. వీరు అంతరాయాలు, విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, బ్రేక్‌డౌన్స్, ట్రిప్పింగ్స్‌పై నిరంతర పర్యవేక్షణ చేస్తూ అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

ఎన్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిన వివరాలు..

నెల	కాలిన ట్రాన్స్‌ఫార్మర్లు	నెల	కాలిన ట్రాన్స్‌ఫార్మర్లు
డిసెంబర్ 2022	3,137	డిసెంబర్ 2023	2,460
జనవరి 2023	2,767	జనవరి 2024	1,856
ఫిబ్రవరి 2023	1,975	ఫిబ్రవరి 2024	1,373
మార్చి 2023	2,415	మార్చి 2024	2,068
ఏప్రిల్ 2023	1,505	ఏప్రిల్ 2024	1,229

నిరంతర మెరుగైన విద్యుత్ సరఫరా..



టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో నిరంతర మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం. సాంకేతిక, నిర్వహణ పరంగా ముందు జాగ్రత్తలు తీసుకున్నాం. దీంతో విద్యుత్ సరఫరాలో గణనీయంగా అభివృద్ధి సాధించాం. ప్రణాళికాప్రకారం ముందుకెళ్తూ మండు వేసవిలోనూ వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ప్రతీ ఉద్యోగి నిబద్ధతతో పని చేస్తున్నారు.

- కర్నాటి వరుణ్‌రెడ్డి, సీఎండీ, టీజీ ఎన్పీడీసీఎల్

అందుబాటులో వరి విత్తనాలు..

● ప్రాంతీయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు ఉమారెడ్డి



హన్మకొండ: వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో వానాకాలం సాగుకు సంబంధించి వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ప్రాంతీయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావాల్సిన రైతులు 9949317565 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

స్వల్ప కాలిక రకాలు..

డబ్ల్యూజీఎల్-1119: ఈ రకం పంట కాలం 115-120 రోజులు. మధ్యస్థ సన్న గింజ కలిగి ఉంటుంది. వివిధ రకాల ఉల్లికోడ్ బయోటైప్‌లను సమర్థవంతంగా తట్టుకుంటుంది. కొంత వరకు పొట్టకుళ్లు తెగులు, మెడవిరుపు తెగులును తట్టుకుంటుంది. ఎకరానికి 24-26 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

డబ్ల్యూజీఎల్-962: ఇది సాంబమసూరి (బీపీటీ -5204)కి ప్రత్యామ్నాయ సన్నగింజ రకం. స్వల్ప కాలిక రకం. 1200125 రోజుల్లో కోతకు వస్తుంది. మధ్యస్థ ఎత్తు కలిగి ఉంటుంది. కొంత వరకు అగ్గి తెగులు, మెడ విరుపు తెగులు తట్టుకుంటుంది. అన్నం నాణ్యతగా ఉంటుంది. ఎకరానికి 26-28 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

డబ్ల్యూజీఎల్-1246: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వరంగల్ నుంచి విడుదలకు సిద్ధంగా ఉన్న స్వల్పకాలిక రకం. 125-130 రోజుల్లో కోతకు వచ్చే సన్న గింజ రకం. ఈ రకం మెడ విరుపు తెగులు, సుడి దోమను కొంత వరకు తట్టుకుంటుంది. పొట్టకుళ్లు, కంకినల్లి, గింజమచ్చ తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుంది. అన్నం నాణ్యతగా ఉంటుంది. ఎకరానికి 28 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

మధ్యకాలిక రకాలు..

డబ్ల్యూజీఎల్-1487: ఈ రకాన్ని జీవ సాంకేతిక శాస్త్రం ద్వారా రూపొందించారు. దీని పంట కాలం 135 రోజులు. ఇది జన్యు పెరుగుల ద్వారా తక్కువ భాస్వరం కలిగిన నేలల్లో సాగు చేయడానికి అనువైన రకం. తక్కువ భాస్వరం కలిగిన నేలల్లో కూడా అధిక దిగుబడి ఇస్తుంది. సుడి దోమ, అగ్గి తెగులును కొంత మేరకు తట్టుకుంటుంది. ఎకరానికి 26-28 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అన్నం నాణ్యతగా ఉంటుంది. సన్నగింజ రకం.

డబ్ల్యూజీఎల్-915: ఈ రకం వానాకాలం సాగుకు అనుకూలమైన మధ్యకాలిక రకం. 135 రోజుల్లో పంట చేతికి వస్తుంది. దొడ్డు గింజ రకం. సుడి దోమ, అగ్గి తెగులు టుంగ్రో వైరస్ తెగులును కొంత మేరకు తట్టుకుంటుంది. డ్రమ్ అటుకులు, మరమరాల తయారీకి అనుకూలం. ఎకరానికి 30-32 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

దీర్ఘకాలిక రకం..

డబ్ల్యూజీఎల్-44: అధిక దిగుబడి, ఎకరానికి 28-30 క్వింటాళ్ల ఇచ్చే సన్న గింజ రకం. 140 నుంచి 145 రోజుల్లో పంట కోతకు వస్తుంది. ఉల్లికోడ్ (బయోటైప్-1)ను తట్టుకుంటోంది. కొంత వరకు చౌడును తట్టుకుంటుంది. గింజ, అన్నం నాణ్యతగా ఉంటుంది. సాంబమసూరి కంటే ఎక్కువ దిగుబడి ఇస్తుంది. ఆ పంట కంటే వారం రోజుల ముందు కోతకు వస్తుంది.

సైబర్ మోసం..

● రూ. 28,500 కాజేసిన నేరగాళ్లు

● పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



మెసేజ్ పత్రాలు చూపుతున్న బాధితుడు మధు

బచ్చన్నపేట : సైబర్ నేరగాళ్లు రోజు రోజుకూ రెచ్చిపోతున్నారు. అమాయకులను ఆసరా చేసుకుని క్షణాల్లో డబ్బును మాయం చేస్తున్నారు. ఇలాంటి ఘటన మండలంలోని నారాయణపురంలో రెండు రోజుల క్రితం జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండం మధు జనగామలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రుణం తీసుకున్నాడు. ప్రతి నెల రుణవాయిదా చెల్లించడానికి తన ఖాతాలో డబ్బు జమ చేస్తున్నాడు. ఈ క్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులు ఖాతాదారుడు దరఖాస్తు చేసుకోకుండానే ఏప్రిల్14న క్రెడిట్ కార్డును పోస్టులో ఇంటికి పంపించి ఆ కార్డును యాక్టివ్ చేసుకోవడానికి బ్యాంకుకు రావాలని పలుమార్లు ఫోన్ చేశారు. కానీ ఖాతాదారుడు మధుకు ఆ కార్డు ఇష్టం లేక బ్యాంకుకు వెళ్లలేదు. అదే నెల 24వ తేదీన మళ్లీ బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని క్రెడిట్ కార్డును యాక్టివ్ చేయడానికి ఓటీపీ పంపించామని తెలుపమని కోరగా మధు ఫోన్‌లో ఆ ఓటీపీ చెప్పాడు. ఈ నెల 14న 'మీరు క్రెడిట్ కార్డు ద్వారా రూ.28,500 విలువైన షాపింగ్ చేశారని, ఆ డబ్బును సకాలంలో చెల్లించాలని' మెసేజ్ రావడంతో బాధితుడు లబోదిబోమంటూ బ్యాంకుకు వెళ్లాడు. అక్కడ బ్యాంకు అధికారులు తమకేమీ తెలియదంటూ సమాధానం ఇవ్వగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వరంగల్‌లో రంజీ మ్యాచ్‌లు

● హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు



క్రీడాకారులతో జగన్మోహన్‌రావు

వరంగల్ స్పోర్ట్స్ : అధునాతన హంగులతో వరంగల్‌లో కొత్త స్టేడియం నిర్మిస్తామని, దీనిపై త్వరలోనే అపెక్స్ కౌన్సిల్‌లో చర్చిస్తామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు ఎ.జగన్మోహన్‌రావు అన్నారు. నగరంలోని ఎల్‌బీ కళాశాల మైదానంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు సోమవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఇక నుంచి వరంగల్‌లో రంజీ మ్యాచ్‌లు నిర్వహించేందుకు ప్రయత్నిస్తామన్నారు. రాష్ట్రంలోని పలు గ్రామాల్లో ప్రతిభ కలిగిన కీడాకారులు ఉన్నారని, వారిని గుర్తించి సానపెడతామని తెలిపారు. ఇందుకోసమే భారీ స్థాయిలో సమ్మర్ క్యాంపులు నిర్వహించామన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పవన్‌కుమార్‌గౌడ్, హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు సర్దార్ ధల్‌జిత్ సింగ్, కార్యదర్శి ఆర్.దేవరాజ్, కోశాధికారి సీజే శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి జస్వరాజు, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి ఉదయభానురావు, అంతర్జాతీయ హ్యాండ్ బాల్ క్రీడాకారుడు పోగుల అశోక్, సీనియర్ క్రీడాకారులు మట్టెడ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చంపక్‌హిల్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ అప్‌గ్రేడ్

● 125కేవీ ఎంఎవీఆర్ నుంచి 400 కేవీకి సామర్థ్యం పెంపు

● ఐదు జిల్లాలకు మెరుగుకానున్న లోవోల్టేజీ సమస్య



విద్యుత్ సబ్‌స్టేషన్ అప్‌గ్రేడ్ చేసిన విద్యుత్ అధికారులు, సిబ్బంది

జనగామ: తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అనుసంధానమైన జనగామ పరిధిలోని చంపక్‌హిల్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంపుతో ఐదు జిల్లాలకు లోవోల్టేజీ విద్యుత్ సరఫరా సమస్యకు పరిష్కారం కానున్నది. జనగామ జిల్లాలోని పసరమడ్ల శివారులోని చంపక్ హిల్స్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో టీజీఎన్పీడీసీఎల్ జనగామ జిల్లా ఎస్‌ఈ టి.వేణుమాధవ్, కన్‌స్ట్రక్షన్ సీఈ పుల్లయ్య, శ్రీరామ్‌కుమార్ తదితరుల పర్యవేక్షణలో 125 ఎంఆర్ఎఆర్ రియాక్టర్‌ను 400 కేవీ బస్‌గా చార్జ్ చేశారు. ఈ విషయమై ఎస్‌ఈ మాట్లాడుతూ రియాక్టర్ ఉపయోగం లైన్లలో వోల్టేజీని నియంత్రించడం, అన్ని పరిస్థితుల్లో ఎల్లప్పుడూ 400 కేవీని మెయింటైన్ చేయడం, వాతావరణ లోపాలతో పాటు వ్యవసాయ సింగిల్ ఫేజ్, త్రీఫేజ్ టైమింగ్‌ల సమయంలో లోడ్ హెచ్చు తగ్గుల కారణంగా సిస్టమ్‌లోని వోల్టేజ్ హై లేదా లోగా మారుతూ ఉంటుందన్నారు. ఇలాంటి జఠిలసమస్యలను సమతుల్యం చేసేలా పెంచిన సబ్‌స్టేషన్ సామర్థ్యం కీలకంగా దోహదపడుతుందన్నారు. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కేటీపీఎస్ జూలూరుపాడు, ఎన్‌టీపీసీ రామగుండం నుంచి (ఇన్‌కమింగ్) 400 కేవీ విద్యుత్ సరఫరా అవుతుంది. ఇక్కడి నుంచి (అవుట్‌గోయింగ్) 220 కేవీ సామర్థ్యం కలిగిన వడ్లకొండ, భువనగిరి, వద్దేకొత్తపల్లి, షాపూర్, దేవన్నపేట విద్యుత్ సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా అవుతోంది. వీటి ద్వారా జనగామ, భువనగిరి, వరంగల్, మహబూబాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర హైవోల్టేజీ విద్యుత్ సరఫరా అవుతుందని వివరించారు. కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్, ఓఎంసీ వరంగల్ ఎస్‌ఈలు సున్నిబాబు, బి.చంద్రశేఖర్, ఈఈ సత్యనారాయణ, ఎంఆర్‌టీ, కన్‌స్ట్రక్షన్, ఓఎంసీ వరంగల్ డీఈలు సంపత్‌రావు, రవీంద్ర, కె.శ్రీనివాస్, ట్రాన్స్‌కో పెంబర్తి ఏఈ కనకయ్య, ఎం.పరుశరాములు పాల్గొన్నారు.

నగరంలో డ్రగ్స్ కలకలం..

● హాశిష్ మత్తు పదార్థంతో పట్టుబడిన అంతర్రాష్ట్ర స్మగ్లర్

● వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరాంనాయక్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్



హాశిష్ మత్తు పదార్థం

రామన్నపేట: గ్రేటర్ వరంగల్‌లో డ్రగ్ కలకలం రేపింది. అతి ప్రమాదకరమైన హాశిష్ మత్తు మందు స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్‌ను మట్టెవాడ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఏపీలోని కాకినాడ జిల్లా ఏలేశ్వరం ఎర్రవరానికి చెందిన చింత వెంకటరాజు అలియాస్ బాబీ ప్రభుత్వ నిషేధిత మత్తు పదార్థంతో హంటర్ రోడ్డులోని ఏడు మోరీల ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో మట్టెవాడ పోలీసులు.. నార్కొటిక్ అనాలసిస్ విభాగం అధికారులతో కలిసి చింత వెంకటరాజును తనిఖీ చేయగా నిషేధిత మత్తు పదార్థం హాశిష్ లభించింది. దీంతో రూ. 4.50 లక్షల విలువైన సరుకును స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. కాగా, నిందితుడు ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దులో ఈ పదార్థాన్ని కొనుగోలు చేసి ఢిల్లీ వెళ్లే క్రమంలో వరంగల్ రైల్వే స్టేషన్‌లో దిగి హంటర్ రోడ్డు రైల్వే ట్రాక్ వద్ద అనుమానాస్పదంగా తారసపడిన క్రమంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సమావేశంలో మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, నార్కొట్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, ఎస్సై విఠల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ధర్నా

● రాత్రివేళలో డ్యూటీ డాక్టర్‌ను నియమించాలి

● అధికారుల హామీతో ఆందోళన విరమించిన మృతుడి బంధువులు



ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

గార్ల: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్లావత్ అశోక్ మృతదేహంతో స్థానిక సీహెచ్‌సీ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గార్ల సమీపంలోని బుద్ధారం రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై కొనఊపిరితో ఉన్న ఇస్లావత్ అశోక్‌ను సీహెచ్‌సీకి తీసుకొచ్చారన్నారు. ఆస్పత్రిలో వైద్యులు ఎవరూ లేరన్నారు. సమయానికి డాక్టర్ ఉంటే అశోక్ బతికేవాడన్నారు. పేరుకే 30 పడకల ఆస్పత్రి కాని రాత్రి వేళలో ఒక్క డాక్టర్ ఉండరని, దీంతో అత్యవసర చికిత్స కోసం వచ్చిన రోగులకు వైద్యం అందక పలువురు మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి ఆస్పత్రికి గార్ల బయ్యారం సీఐ బి.రవికుమార్ చేరుకుని మృతుడి బంధువులతో జిల్లా వైద్యశాఖ సూపరింటెండెంట్‌తో మాట్లాడించి ఆందోళన విరమింపజేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నీ వెంటే నేను..

● గుండెపోటుతో భర్తమృతి... తట్టుకోలేక భార్య కన్నుమూత



భార్యాభర్తలు నాగయ్య, లక్ష్మి (ఫైల్)

మహాముత్తారం: భర్తతో ఏళ్ల జీవితాన్ని పంచుకున్న భార్య.. ఆయన హఠాన్మరణంతో కుంగిపోయి తను కూడా తనువు చాలించింది. గంటల వ్యవధిలోనే ఇద్దరూ మరణించారు. ఈ విషాద ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలకేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన లింగమల్ల నాగయ్య (65) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. నాగయ్య మరణాన్ని తట్టుకోలేక భార్య లక్ష్మి (60) ఏడుస్తూ సోమవారం ఉదయం ప్రాణం విడిచింది. ఇద్దరు ఒకే సారి మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వారికి ముగ్గురు కుమారులు. అందరికీ పెళ్లిళ్లు అయి స్థిరపడ్డారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఆది, సోమవారాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కొడకండ్ల మండలం రామవరం గ్రామానికి చెందిన ఇద్దరు, కాటారం మండలం మేడిపల్లిలో ఒకరు, హసన్‌పర్తి మండలం అన్నాసాగరం వద్ద మరొకరు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



శ్రావణ్(ఫైల్)



శివ(ఫైల్)

కొడకండ్ల : మాయదారి మృత్యువు మాటు వేసి కాటు వేసింది. కర్రీ తెచ్చుకునేందుకు వెళ్లిన అన్నదమ్ములను కారు రూపంలో అమాంతం బలితీసుకుంది. ఈ ప్రమాదం హైదరాబాద్‌లో జరగగా.. కొడకండ్ల మండలం రామవరంలో విషాదం నెలకొంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రామవరం గ్రామానికి చెందిన మేటి రాములు, రాజేశ్వరి దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడికి వివాహమై కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. రెండో కుమారుడు శ్రావణ్ బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ పీర్జాదిగూడలో నివాసం ఉంటుండగా చిన్నకుమారుడు శివ ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రస్తుతం వరంగల్ ఎంజీఎంలో పనిచేస్తూ ఆదివారం అన్న శ్రావణ్ నివాసముంటున్న పీర్జాదిగూడకు వెళ్లాడు. రాత్రి పది గంటల సమయంలో కర్రీ తెచ్చుకునేందుకు ఇద్దరు బైక్‌పై వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో కారు.. బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో శివ అక్కడికక్కడే మృతి చెందగా శ్రావణ్‌ను ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. కాగా, ఎదిగిన ఇద్దరు కొడుకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను సోమవారం గ్రామానికి తీసుకురాగా కడసారి చూసేందుకు వచ్చిన గ్రామస్తులు బోరున విలపించారు.

మేడిపల్లిలో మరొకరు..

కాటారం: కాటారం మండలం మేడిపల్లి అటవీ ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లి కృష్ణకాలనీకి చెందిన కోదాది శ్యామ్‌కుమార్ (30) తన స్నేహితుడు ఠాకూర్ పృథ్వీతో కలిసి ద్విచక్రవాహనంపై మరో స్నేహితుడిని దింపడానికి మండలంలోని బయ్యారం వచ్చారు. తిరుగు ప్రయాణంలో పృథ్వీ బైక్ నడుపుతుండగా శ్యామ్‌కుమార్ వెనుక కూర్చున్నాడు. మేడిపల్లి అటవీ ప్రాంతంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో శ్యామ్‌కుమార్ ఎగిరి రోడ్డుపై పడ్డాడు. ఈ సమయంలో భూపాలపల్లి నుంచి కాటారం వైపునకు వెళ్తున్న ఏపీ 36టీబీ 4672 నంబర్ గల తుఫాన్ వాహనం శ్యామ్‌కుమార్‌ను గమనించక అతడి పైనుంచి వెళ్లింది. దీంతో శ్యామ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. పృథ్వీకి గాయాలు కావడంతో భూపాలపల్లిలోని ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య దివ్య, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి శివదర్శనం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

అన్నాసాగరంలో రిటైర్డ్ ఉద్యోగి..



కొమురయ్య(ఫైల్)

హసన్‌పర్తి: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ రిటైర్డ్ ఉద్యోగి మృతి చెందాడు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరం బీసీ కాలనీలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అన్నాసాగరానికి చెందిన గడ్డం కొమురయ్య(70) రిటైర్డ్ రైల్వే ఉద్యోగి. ప్రస్తుతం కాజీపేట డీజిల్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. సోమవారం వ్యక్తిగత పని నిమిత్తం అదే ప్రాంతంలో ఉంటున్న తన సోదరుడి సదానందంతో కలిసి అన్నాసాగరానికి బయలుదేరారు. సదానందం బైక్ నడుపుతుండగా కొమురయ్య వెనుక కూర్చున్నాడు. గ్రామంలోని బీసీ కాలనీకి చేరుకోగానే వెనుక నుంచి వస్తున్న బైక్.. వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కొమురయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు సదానందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.